వైఎస్సార్ సీపీ మరింత పటిష్టం

- 'వై నాట్ 175' లక్ష్యంగా సీఎం జగన్ ఆదేశాలు
- ప్రతి కార్యకర్తకూ ప్రత్యేక గుర్తింపు
- పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశంలో ఎంపీ భరత్‌రామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలో 'వై నాట్ 175' లక్ష్య సాధనలో భాగంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో వైఎస్సార్ సీపీని మరింత పటిష్టపరచడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అనేక చర్యలు చేపడుతున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షత వహించగా ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగర పరిధిలోని 42 డివిజన్లలో 96 సచివాలయాలు ఉన్నాయని, ప్రతి సచివాలయానికి ముగ్గురు కో ఆర్డినేటర్లు, ఒక జేసీఎస్ ఉంటారన్నారు. తాను కూడా ఒక జేసీఎస్‌గా బాధ్యతలు తీసుకుని పనిచేస్తానన్నారు. ఒక్కొక్క జేసీఎస్ కింద రమారమి 12 నుంచి 18 మంది వలంటీర్లు ఉంటారన్నారు. నగరాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించి ఐదుగురు గృహసారథులుంటారని, వారే బూత్ లెవెల్ మెంబర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఇంకా కొన్ని చోట్ల గృహసారథులను నియమించాల్సి ఉందని, త్వరలోనే వాటిని భర్తీ చేస్తామన్నారు. క్రియాశీలక కార్యకర్తలుగా ఎవరైతే పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నారో వారిని గుర్తించి నియమిస్తామన్నారు.

డ్వాక్రా మహిళలకు టీడీపీ అన్యాయం

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ గతంలో టీడీపీ జన్మభూమి కమిటీలను వేసి పెత్తందారీ వ్యవస్థను ప్రోత్సహించడం వల్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. అలాగే డ్వాక్రా మహిళలను టీడీపీ సభలూ సమావేశాలకు వినియోగించుకుందే కానీ, వారికి తగిన రీతిలో న్యాయం చేయలేదన్నారు. మన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డ్వాక్రా మహిళల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 80 లక్షల డ్వాక్రా మహిళల రుణమాఫీ కోసం ఐదేళ్లలో రూ.25 వేల కోట్లు మంజూరు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. రాజమహేంద్రవరం నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశామన్నారు. ధైర్యంగా తలెత్తి ఓటు అడిగే హక్కు మనకు మాత్రమే ఉందని, వైఎస్సార్‌సీపీలో కార్యకర్తగా ఉండటమే ఒక హోదా అన్నారు.

ఘాట్ల వద్ద పటిష్ట ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. గురువారం ఆయన నగరంలోని ప్రధానఘాట్లను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. పుష్కరఘాట్, స్నానపు జల్లు ఏర్పాటు, షవర్ల పనితీరును పరిశీలించారు. కోటిలింగాల, మార్కండేయేశ్వర, వీఐపీ, గౌతమ, సరస్వతి తదితర ఘాట్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధికారులు ఏర్పాట్లలో బిజీగా ఉన్నారన్నారు. ఆయన వెంట నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, టీకే విశ్వేశ్వరరెడ్డి, వాకచర్ల కృష్ణ, రామ్‌సాయి దీపు, అరిగెల బాబు, దూర్వాసుల సత్యనారాయణ, కొత్తా బాలమురళి తదితరులు ఉన్నారు.



ఘాట్‌లను పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న చందన నాగేశ్వర్

కడియం: కడియపులంక పాతపువ్వుల మార్కెట్‌లోని ఆంజనేయస్వామిని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో స్వామిని దర్శించుకున్న చందనకు ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికింది. అనంతరం చందన ప్రత్యేక పూజలు చేసి, ఆశీర్వచనం తీసుకున్నారు. 18వ తేదీన మహా శివరాత్రి సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయం వద్ద జరిగే అన్నదాన కార్యక్రమానికి వేలమంది హాజరవుతారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను చందన ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటికి ఇబ్బందుల్లేకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. నీటి సరఫరాకు అడ్డంకుల్లేకుండా చూడాలని సంబంధిత డీఈని ఆదేశించారు. నాగేశ్వర్ వెంట ఆలయ కమిటీ చైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం, కడియం మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, కడియపుసావరం మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, స్థానిక నాయకులు పల్ల ప్రసాద్, బోడపాటి మూర్తి ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేద్దాం

కంబాలచెరువు: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినులను చేర్పించి బలోపేతం చేయాలని కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి పిలుపునిచ్చారు. ఈ మేరకు కళాశాల విద్యార్థినులు గురువారం ర్యాలీ నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలలో ఎక్కువమంది విద్యార్థినులను చేర్పించేందుకు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కళాశాలలోని సౌకర్యాలు, క్యాంపస్ ఇంటర్వ్యూలపై అవగాహన కల్పిస్తున్నామని, ఈనెల 20న తమ కళాశాలలో బహిరంగ సమావేశం నిర్వహిస్తామన్నారు. దీనిపై జూనియర్ కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వనజ రత్నం, పీఎస్ఎస్ఎస్ దుర్గాప్రసాద్, ఎంఎస్ చక్రవర్తి, పి.శ్రీదేవి, విజయలక్ష్మి, ప్రియాంక, స్వాతి పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో దుర్గ ఈషకు రజత పతకం



బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపిన దుర్గ ఈష

రాజమహేంద్రవరం సిటీ: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జైపూర్, రాజస్థాన్‌లో జరిగిన యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 2023లో రాజమహేంద్రవరానికి చెందిన కండ్రపు దుర్గ ఈష రజత పతకం సాధించింది. ఫిబ్రవరి 5 నుంచి 12 వరకూ సావాయి మాన్‌సింగ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో నిర్వహించిన ఈ ర్యాంకింగ్ పోటీల్లో అండర్ -17 సింగిల్ విభాగంలో ఆమె ఈ ఘనత సాధించింది. ఈ విషయాన్ని ఆమె తండ్రి, తూర్పు గోదావరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కండపు రాజారెడ్డి గురువారం వెల్లడించారు. మార్చిలో చండీగఢ్ పంచకులలో జరిగే సబ్ జూనియర్ ర్యాంకింగ్ పోటీల్లో ఈష పాల్గొంటుందన్నారు. ఆమె అంతర్జాతీయస్థాయిలో రాణించేందుకు హైదరాబాద్‌లోని పద్మ భూషణ్ పుల్లెల గోపీచంద్ అకాడమీలో శిక్షణ ఇప్పిస్తున్నట్లు రాజారెడ్డి తెలిపారు. కాగా.. జాతీయ స్థాయిలో విజయం సాధించిన దుర్గ ఈషకు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, సీనియర్ ఉపాధ్యక్షుడు డీవీవీ త్రినాథ్, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ బాలాత్రిపుర సుందరి అభినందనలు తెలిపారు.

కేంద్రకారాగారం సందర్శన



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: స్థానిక మహిళా కేంద్రకారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి గురువారం సందర్శించారు. అక్కడ ఉన్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించడానికి క్షణికావేశంలో చేసిన నేరాల వల్ల విలువైన జీవితం కోల్పోతున్నారన్నారు. దీంతో కుటుంబ బాంధవ్యాలు దెబ్బతింటాయన్నారు. పరివర్తన చెంది మంచి మనుషులుగా, బాధ్యత గల పౌరులుగా జీవించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార అండగా ఉంటుందన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ సునీత

రాజానగరం: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదామని డిప్యూటీ తహసీల్దార్ ఎం.సునీత అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో మండల స్థాయిలో బాల్య వివాహాల నిరోధక, పర్యవేక్షణ, చైల్డ్ లైన్ 1098 అడ్వైజరీ బోర్డును వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో కూడా బాల్య వివాహాలు జరుగుతుండటం విచారకరమన్నారు. బాలలపై వివక్ష చూపడం, వేధింపులకు గురిచేయడం కొన్నిచోట్ల అధికమవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందనే విషయాన్ని గ్రహించాలన్నారు. తహసీల్దార్ చైర్మన్‌గా, ఎంపీడీఓ వైస్ చైర్మన్‌గా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కన్వీనర్‌గా, మెడికల్ ఆఫీసర్ కోకన్వీనర్‌గా మండల స్థాయిలో ఏర్పడిన బోర్డులో ఇతర శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామ స్థాయిలో కూడా ఇదే విధంగా బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. వాట్సప్ గ్రూప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకునే సదుపాయం కల్పిస్తామన్నారు. చైల్డ్ లైన్ 1098 కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించినా, సహకరించినా.. చట్టప్రకారం రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. పోక్సో చట్టాన్ని అనుసరించి జైలుకు కూడా పంపిస్తారన్నారు. సమావేశంలో సీడీపీఓ టి.నాగమణి, ఈఓపీఆర్డీ బొజ్జిరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.రవి కుమార్, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది, మహిళా కార్యదర్శులు పాల్గొన్నారు.


సామాజిక చైతన్యమే ఐబీపీ లక్ష్యం

ప్రకాశం నగర్: సామాజిక చైతన్యమే ఇండియన్ బిలివర్స్ పార్టీ (ఐబీపీ) లక్ష్యమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు సెబాస్టియన్ అన్నారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయమే తమ పార్టీ సిద్ధాంతమన్నారు. మతాలను రెచ్చగొట్టి, కుట్రలతో, మత ఘర్షణలతో బీజేపీ పాలన సాగిస్తోందని ఆరోపించారు. క్రైస్తవులను కేవలం ఓటుబ్యాంక్‌గా మాత్రమే చూస్తోందన్నారు. క్రైస్తవులను చైతన్య పరిచి, వారికి సామాజిక, రాజకీయ గుర్తింపు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. తమ పరిధిలో 35 వేల చర్చిలు ఉన్నాయన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ధవళేశ్వరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ధవళేశ్వరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఇండస్ట్రియల్ కాలనీ, ఎర్రకొండ, ఇనోసాల్ట్ ఏరియా, రత్నా ట్యూబ్స్, మంతెన ఆశ్రమం, బత్తిన సుబ్బారావు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

శివరాత్రికి పటిష్ట బందోబస్తు



వంగలపూడి రేవు నుంచి గోదావరిలో వేసిన దారిని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

సీతానగరం: వంగలపూడి, రామచంద్రపురం రేవు నుంచి పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి తరలివెళ్లే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు అన్నారు. వంగలపూడి, పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం రేవుల నుంచి భక్తులు తరలివెళ్లడానికి చేసిన ఏర్పాట్లను కోరుకొండ సీఐ ఉమా మహేశ్వరరావు, ఎస్సై కె.శుభశేఖర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. వంగలపూడిలో వాహనాలు పార్కింగ్ స్థలాన్ని, గోదావరిపై వేసిన నడక మార్గాన్ని పరిశీలించారు. రామచంద్రపురం నుంచి గోదావరిలో నీరు లేకపోవడంతో ట్రాక్టర్లు నేరుగా పట్టిసీమ వెళ్లడానికి అనువుగా ఉన్నందున ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఎక్కడ నిర్వహిస్తారనేది ఆరా తీశారు.

శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

రంగంపేట: చంద్రేడులో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చంద్రశేఖర స్వామి కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే కల్యాణోత్సవంలో 17న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 18న కల్యాణం, 19వ తేదీ రాత్రి పుష్పోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులందరూ వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన

కంబాలచెరువు: గోకవరం బస్టాండ్ సమీపంలోని రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలో యూఎస్‌ఏ శ్రీన్ తెరపటిక్స్ ఇన్ కార్పొరేషన్ ప్రెసిడెంట్, చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ అలుగుపల్లి కిషోర్..బయో టెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీలో జరుగుతున్న పురోగతి, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. విదేశాలలో ఉన్నత చదువులు ఏ విధంగా చదువుకోవాలో వివరించారు. కళాశాల మైక్రో బయాలజీ విభాగాధిపతి కె.గౌరీకుమారి మాట్లాడుతూ లైఫ్ సైన్సెస్ విద్యార్థులకు ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల వారిలో చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ తేతలి సత్య సౌందర్య, అధ్యాపకులు సునీత, కిరణ్మయి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామనామ సంకీర్తన



కడియపులంకలో సంప్రోక్షణ చేస్తున్న హనుమాన్ మాలధారులు

కడియం: హనుమాన్ మాలలు ధరించిన భక్తుల జై శ్రీరామ్ నినాదాలతో కడియపులంక మార్మోగింది. పాత పువ్వుల మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఏటా శివరాత్రి రోజు వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. గురువారం మాలధారులు 73 కలశాలలో మంత్రపూజిత జలంతో సంప్రోక్షణ, రామనామ సంకీర్తన నిర్వహించారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ



ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న జక్కంపూడి రాజశ్రీ

కంబాలచెరువు: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంఘ సభ్యులకు రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ చేతుల మీదుగా గురువారం ధ్రువీకరణ పత్రాల పంపిణీ జరిగింది. గతేడాది డిసెంబర్ 22న ఫస్ట్ ఎయిడ్ అండ్ హోమ్ నర్సింగ్ ట్రైనింగ్ అయిన బీఎంపీలకు వీటిని ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు లంక సత్యనారాయణ, రాష్ట్ర గౌరవ సలహాదారులు ఆకాశం గౌరీష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఓ.ఇమామ్, పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

చాంబర్ ట్రస్ట్ విరాళం



బాలోత్సవానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే గోదావరి బాలోత్సవానికి ది చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ తరపున రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీటీలో యూనివర్సిటీ స్థాయి బహుమతి పొందిన గౌతమ్ కోచింగ్‌కు చెన్నై వెళుతున్న సందర్భంగా రూ.20 వేలు అందించారు. గాయపడిన జట్టు కార్మికుడు రాజారావుకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం

సీటీఆర్ఐ: స్థానిక ఆజాద్ చౌక్ సమీపంలోని పాండురంగస్వామి ఆలయం అభివృద్ధికి ఆదిరెడ్డి కుటుంబం తమ భవాని చారిటబుల్ ట్రస్టు తరపున సహకారం అందించింది. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకుల కోరిక మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అక్కడి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి, పాండురంగస్వామి, మహాలక్ష్మి ఆలయాల గర్భగుడులకు స్టీల్ ద్వారాలు చేయించి అందజేశారు.

పుస్తకం ఆవిష్కరణ

కడియం: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితం ఆదర్శనీయమని సేవాస్తంభ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహనరాజు అన్నారు. సంజీవయ్య జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక హైస్కూల్లో సంజీవయ్య జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సేవాస్తంభ్ జిల్లా అధ్యక్షుడు స్వామి ప్రసాద్ పాల్గొన్నారు. సంజీవయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

రూ.1.30 లక్షల సొత్తు మాయం

కడియం: వేమగిరితోట పాత రామాలయం వీధికి చెందిన మట్టపర్తి సత్యదుర్గాప్రసాద్ ఇంట్లో దొంగలు పడి సుమారు 1.30 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదును చోరీ చేశారు. కడియం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంధువుల వివాహం నిమిత్తం సత్యదుర్గాప్రసాద్ ఇంటికి తాళం వేసుకుని వెళ్లారు. అనంతరం తిరిగి వచ్చి చూసేసరికి తలుపులకు ఉన్న తాళాలు తొలగించి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా ఇనుప బీరువాను పగలకొట్టి, అందులోని వస్తువులను దోచుకుపోయారు.

వ్యక్తిపై దాడి

కంబాలచెరువు: స్థానిక గామన్ బ్రిడ్జి వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అటుగా వెళ్తున్న మరో వ్యక్తి నుంచి సెల్‌ఫోన్, బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. సీతానగరానికి చెందిన వెంకట్ పని నిమిత్తం రాజమహేంద్రవరం వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో గామన్ బ్రిడ్జి వద్దకు చేరేసరికి అతనికి ఫోన్ వచ్చింది. ఆ సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి సెల్‌ఫోన్, మెడలోని చైన్‌ను లాక్కున్నారు. దీంతో అతను వారిని ఎదురించే ప్రయత్నం చేయగా కత్తితో గాయపర్చి పరారయ్యారు.

నూతన దంపతులకు మంత్రి రాజా ఆశీర్వచనాలు



కుసుమ, చేతన్‌ను ఆశీర్వదిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కడియం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), ఆర్యాపురం అర్బన్ బ్యాంకు చైర్మన్ గిరజాల రామకృష్ణ తులసి కుమార్తె కుసుమకు చేతన్‌తో ఇటీవలే వివాహమైంది. ఈ నేపథ్యంలో నూతన దంపతులను కడియంలోని వారి స్వగృహంలో రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా గురువారం ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, సొసైటీ చైర్మన్ వెలుగుబంటి అచ్యుతరామ్, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, సొసైటీ డైరెక్టర్ వార రాము పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తులకు అదనపు విలువ జోడించాలి

- ఎన్ఏఏఆర్ఎం డైరెక్టర్ శ్రీనివాసరావు
- రైతులకు శిక్షణ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు

కడియం: రైతులు తమ ఉత్పత్తులకు అదనపు విలువను జోడించాలని, అప్పుడే తగిన ఆదాయం పొందగలుగుతారని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఏఏఆర్ఎం) సంస్థ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణా సంస్థలు సంయుక్తంగా గురువారం కడియం మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని డాక్టర్ శ్రీనివాసరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రైతు ఉత్పత్తి చేసే ప్రతి పంటకు అదనపు విలువను జోడించే విధానాలను, ఆధునిక సాంకేతికతను, యాంత్రీకరణ విధానాలను ఈ శిక్షణలో వివరిస్తారన్నారు. సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్, రాజమహేంద్రవరం అగ్రికల్చర్ కాలేజీ డీన్ డాక్టర్ శ్యామ్‌రాజ్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఐసీఏఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ డి.దామోదర్‌రెడ్డి మాట్లాడారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.విజయ శంకర్‌బాబు మాట్లాడుతూ శిక్షణలో భాగంగా మొదటి రోజు న్యూట్రిషన్ మేనేజ్‌మెంట్, వాల్యూ యాడెడ్ ఉత్పత్తులు, తృణ ధాన్యాలను గురించి సంబంధిత రంగాల్లోని ప్రముఖులు వివరిస్తారన్నారు. భూమి ఆరోగ్యం పరిరక్షించుకోవడం, డ్రోన్ టెక్నాలజీ, మైక్రో ఇరిగేషన్ తదితర అంశాలపై కూడా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్ నాయక్, ఏఈవో శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి శాంతా ఆలివ్, ద్వారకాదేవి, మండల ఉద్యానవనాధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఈ శిక్షణకు హాజరయ్యారు.

రెస్టారెంట్లలో విజిలెన్స్ తనిఖీలు



బొమ్మూరులో స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: విజిలెన్స్ ఎస్పీ పీవీ రవికుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు గురువారం బొమ్మూరులోని వివిధ రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. దీవెన టిఫిన్ సెంటర్‌లో వాణిజ్య సిలిండర్లకు బదులు మూడు డొమెస్టిక్ (గృహ) సిలిండర్లు వినియోగిస్తున్నారు. అలాగే వైష్ణవి ఫుడ్‌మేజిక్ హోటల్‌లో ఆరు డొమెస్టిక్ సిలిండర్లను గుర్తించారు. ఆ రెస్టారెంట్ల యజమానులపై 6 ఏ కేసు నమోదు చేసి, తొమ్మిది గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పీవీ రవికుమార్ మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, తహసీల్దార్ విజయకుమార్, సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ జీడీ మల్లేశ్వరి పాల్గొన్నారు.

పోలవరానికి నిధులివ్వడంలో కేంద్రం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

ప్రకాశం నగర్: పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ నిధులివ్వడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు కేంద్రం కేవలం 5,800 కోట్లు మాత్రమే విడుదల చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో 67 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని, అయినా పోలవరం ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదన్నారు. పోలవరంతో పాటు రాష్ట్రంలోని సాగు, తాగునీటి ప్రాజెక్టులను సందర్శించి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయడానికి సీపీఐ బృందం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. ఈ నెల 20వ తేదీన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నుంచి బయలుదేరి పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల గృహాలకు అందిస్తున్న సహాయం సరిపోవడం లేదని, దాన్ని పెంచాలని డిమాండ్ చేస్తు మార్చి 2న చలో విజయవాడకు పిలుపునిచ్చామని తెలిపారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, పార్లమెంట్ సాక్షిగా చేసిన విభజన చట్టంపై కూడా గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

సోము వీర్రాజుపై విమర్శలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న బొమ్ముల దత్తు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజును విమర్శించే అర్హత కన్నా లక్ష్మీనారాయణకు లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి అన్నారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పార్టీలో ఉండడం ఇష్టం లేనివారు వెళ్లిపోవచ్చునని, కానీ అలా వెళుతూ సోము వీర్రాజును విమర్శించడం తగదన్నారు. నిజానికి కన్నా రాజీనామాతో పార్టీకి పట్టిన చీడ వదిలిందని వ్యాఖ్యానించారు. నాలుగున్నర దశాబ్దాలుగా అంకితభావంతో పనిచేస్తున్న వీర్రాజును విమర్శించడం కన్నాకు తగదన్నారు. సమావేశంలో కురగంటి సతీష్, యెనుముల రంగబాబు, అడబాల రామకృష్ణ, బూర రామచంద్రరావు పాల్గొన్నారు.

20 నుంచి ప్రత్యేక ఆధార్ కౌంటర్

రాజమహేంద్రవరం సిటీ: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు పూర్తయిన వారందరూ తప్పనిసరిగా నవీకరణ చేసుకోవాలని రాజమహేంద్రవరం తపాలా డివిజన్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ అన్నారు. స్థానిక శ్యామలా నగర్ పోస్టాఫీసులో ప్రత్యేక ఆధార్ కౌంటర్‌ను ఏర్పాటు చేశామని, ఈనెల 20 నుంచి 25 వరకూ.. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుందన్నారు. చిరునామా మార్పుకు రూ.100, మొబైల్ నంబర్ నవీకరణకు రూ.50, ఇతర సేవలను నామమాత్రపు రుసుముకే అందజేస్తామన్నారు.

సినిమాలు

శ్యామల	అమిగోస్
సూర్యమినీ	శ్రీదేవి శోభన్‌బాబు
సూర్యప్యాలెస్	క్యాంటమేనియా
స్వామి	వాల్తేరువీరయ్య
శివజ్యోతి	సార్
అనుశ్రీ	క్యాంటమేనియా
అశోక	సార్
ఊర్వశి	రైటర్ పద్మభూషణ్
రంభ	క్యాంటమేనియా
మేనక	వీరసింహారెడ్డి
గీతాఅప్సర	సార్
నామవరం	
వీఎస్ మహల్	సార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	అమిగోస్
కడియం	
వెంకటసూర్య	అమిగోస్